ఎరువుల వినియోగం.. పరిమితి అవసరం

- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- ఎరువుల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు

పాలకొల్లు సెంట్రల్: రైతులు పండించే పంటల్లో ఆదాయమే కాకుండా ఆరోగ్యం కూడా చూసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం వరకూ రైతులు వరి పంట పండించడంలో సేంద్రియ ఎరువులకే అధిక ప్రాధాన్యతనిచ్చేవారు. అయితే రానురానూ రసాయన ఎరువులకు అధిక ప్రాధాన్యతనివ్వడంతో పంటల్లో అధిక దిగుబడులు వస్తున్నాయి. అలాగే అనారోగ్యాలభారిన పడుతున్నారు. కానీ ఈ విధానం మంచిది కాదని వ్యవసాయ నిపుణులు, వైద్యులు చెపుతున్నారు. పెరుగుతున్న ధరలను బట్టి రైతులు ఆదాయం పెంచుకునే భాగంలో అధికంగా ఎరువులను వాడుతున్నారు. దాంతో దిగుబడులు పెరుగుతున్నాయి. అలాగే అనారోగ్యాలు పెరుగుతున్నాయి. పూర్వం ఎకరం పొలంలో సుమారు 15 బస్తాలు వరకూ పండించేవారు. నేడు అదే భూమి అదే విత్తనం కాని ఎకరానికి దాదాపుగా 40 బస్తాలు పండిస్తున్నారు. అంటే ఎరువుల వాడకం అధికం అవ్వడంతోనే ఈ దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

పెరుగుతున్న ఆసక్తి

ప్రస్తుతం రైతులు కాంప్లెక్స్ ఎరువుల వాడకంలో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు రాబట్టవచ్చు. అలాగే పశువుల పెంట, పచ్చిరొట్టల వంటి సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం పెరుగుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. నియోజకవర్గంలో పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాలు ఉన్నాయి. ఈ ఖరీఫ్‌కు పాలకొల్లు మండలంలో 10142 ఎకరాలు, యలమంచిలి మండలంలో 5622 ఎకరాలు, పోడూరు మండలంలో 14142 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. నారుమడులు వేసుకుని సిద్ధంగా ఉన్నారు. మరో పది రోజుల్లో నాట్లు కోసం భూమిని సిద్ధం చేసుకుంటున్నారు. వరిసాగులో యూరియా, డీఏపితో పాటు పొటాష్ తగిన మోతాదులో వాడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.


నాట్లకు సిద్ధం చేసిన భూమి (ఫైల్)


మడుల్లో ఎరువులు జల్లుతున్న రైతులు (ఫైల్)

ఎరువుల వినియోగం ఇలా

ఎకరం పొలానికి 5 సెంట్లు విస్తీర్ణంలో నారుమడి తయారు చేసుకోవాలి. విత్తనాలు చల్లిన తరువాత నాలుగు కేజీల డీఏపీ, రెండు కేజీల యూరియా, కేజీ పోటాష్ కలిపి వేస్తే ఆకు ఏపుగా ఎదుగుతుంది. మొదటి దమ్ములో మూడు బస్తాల సూపర్, బస్తా డీఏపీ, ఊడ్పులు చేసే ముందు 35 కేజీల యూరియా 12 కేజీల పొటాష్ కలిపి వాడాలి. ఊడ్పులు చేసిన 45 రోజులు తరువాత 45 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ వేసుకోవాలి. పొట్ట దశలో మరో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ కలిపి వాడాలి. 60 రోజుల వ్యవధిలో 35 కేజీల యూరియా, 15 కేజీల పోటాష్ చొప్పున వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

పోటాష్ లోపంతో ఇబ్బందులు

సాధారణంగా రైతులు వరిసాగులో యూరియా, డీఏపీలకు అధిక ప్రాధాన్యమిస్తూ పొటాష్ వినియోగంపై పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. పొటాష్ లోపం వల్ల గింజ గుల్లబారి బరువు తగ్గే ప్రమాదం ఉంటుంది. అందువల్ల రైతులు వ్యవసాయాధికారుల సూచనలు మేరకు సాగులో పొటాష్ వినియోగంపై దృష్టి సారించాలని అంటున్నారు. పొటాష్‌ను సరిగ్గా ఉపయోగించకపోతే దిగుబడుల్లో రైతులు నష్టపోయే అవకాశం ఉంటుంది.

భూమి సారవంతం కోసం

పంటసాగు చేసే పొలంలో దమ్ము చేయడానికి 15 రోజులు ముందు పశువుల పెంట, జీలుగ, జనుము, పిల్లిపెసరవంటి పచ్చిరొట్ట ఎరువులు వాడితే భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయి. వీటిని వాడడం వల్ల భూమిలో సారవంతం తగ్గకుండా ఉంటుంది. రైతులు రసాయనిక ఎరువులు కన్నా అతి తక్కువ ఖర్చయ్యే సేంద్రియ ఎరువులను తయారు చేసుకుని వాడితే ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. కొద్దిగా కష్టంగా అనిపించినా రైతులు సేంద్రియ ఎరువులకే ప్రాధాన్యత ఇస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచిస్తున్నారు.

రైతులు అవగాహన పెంచుకోవాలి



వరి సాగు చేసే రైతులు ఎరువుల వినియోగంలో అవగాహన పెంచుకోవాలి. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. సమగ్ర ఎరువులు వల్ల ఖరీఫ్ సాగులో మంచి దిగుబడులు వస్తాయి.రైతు కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకుని సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపితే దిగుబడుల్లో మంచి ఫలితాలతో పాటు ఆరోగ్యకరమైన పంటను అందించవచ్చు.

– కె.రాజశేఖర్, ఏవో, పాలకొల్లు

చినుకుపడితే చెరువులే

పెనుగొండ: చినుకుపడితే చాలు తమ వీధులు చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికి పల్లగా ఉన్న రహదారుల వద్ద వర్షపు నీరు నిలిచిపోయి పది పదిహేను రోజుల పాటు చెరువుల్లా మారుతున్నాయి. దీంతో రహదారులు దుర్వాసన వెదజల్లడమే కాకుండా, బురదమయంగా మారుతున్నాయి. దీంతో ఆ ప్రాంతం వద్దకు వెళ్లాలంటే చాలు ప్రజలు హడలిపోతున్నారు. ముఖ్యంగా పెనుగొండలో శివాలయం వీధిలో శివాలయం వద్ద ప్రతిసారీ వర్షపు నీరు నిలిచిపోయి చెరువులా మారుతుంది. అదేవిధంగా వంతెన వీధిలో వంతెన పక్క ప్రాంతమంతా వర్షపు నీటితోచెరువులా మారింది. ఇదే పరిస్థితి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన వాసవీ శాంతి ధాం వద్ద కూడా నెలకొంది. రామచంద్రరావు పేటలో వాసవీ శాంతి ధాం ఎదురుగా పూర్తిగా పల్లంగా మారడంతో వర్షం వచ్చిన ప్రతిసారీ బురదమయంగా మారుతుంది. నిత్యం వందలాది మంది భక్తులు వాసవీ శాంతి ధాం కు వచ్చి 90 అడుగుల పంచలోహ విగ్రహాన్ని దర్శించుకుని మరకతశిల వాసవీ మాతకు పూజలు నిర్వహిస్తుంటారు. అయితే, వర్షం కురిస్తే చాలు భక్తులు వేసుకొచ్చే వాహనాలు నిలుపుకోవడానికి చెరువలా మారి, బురదగామయంగా మారిన ప్రాంతంలో వాహనాలు నిలుపుకోలేక అవస్థలు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో అభివృద్ధి చేయాలని వినతులు విన్నవిస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. దీంతో యాత్రీకులు నానావస్థలు పడుతున్నారు.


పెనుగొండ శివాలయం వద్ద చెరువును తలపిస్తున్న దృశ్యం

డ్రెయినేజీ వ్యవస్థే అసలు సమస్య

ఇదే పరిస్థితి అంబేడ్కర్ కాలనీలోనూ, యర్రానారాయణ స్వామి కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద, రాజీవ్ సెంటర్‌లో ఎల్లప్ప కాలువ వద్ద ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వలనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయకుండా దశాబ్దాలు క్రితం నిర్మించిన డ్రెయినేజీ వ్యవస్థనే వినియోగిస్తుండడంతో వర్షపు నీరు వెళ్లకుండా రహదారులపై నిలిచిపోతుందని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయడానికి పలుమార్లు ప్రతిపాదనలు చేసినా ప్రతిపాదనలు స్థాయిలోనే నిలిచిపోయాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రెయినేజీ వ్యవస్థకు మోక్షం కల్పించి వర్షపునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతమైన వాసవీ శాంతి ధాం వద్ద దుస్థితి


పెనుగొండ వంతెన వీధిలో చెరువులా వర్షపు నీరు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


సీతారామపురంలో నోట్‌బుక్స్‌ను అందజేస్తున్న రాజ్ ట్రస్ట్, దళిత జేఏసీ నాయకులు

నరసాపురం రూరల్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న దానికి తోడు దాతలు చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. మంగళవారం మండలంలోని సీతారామపురం, కొత్తపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దళిత జేఏసీ, రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, న్యాయవాది ఇంజేటి జాన్ కెనడీలు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానంతో 200 మంది విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కాకిలేటి ఆనందకుమార్, వర్ధనపు సుధాకర్‌బాబు, పడవల మేరీ సత్యనారాయణ, పిల్లి నవరత్నం కాటిక తాతారావు, కాటం చంటి, ముురాల స్వామి పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువత మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులు అవ్వొద్దని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ మల్లిపూడి హిమ మిత్ర విజ్ఞప్తి చేశారు. కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వశాఖ సహకారంతో మంగళవారం స్థానిక కోడే వెంకట్రావు మునిసిపల్ హైస్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్ర మాట్లాడుతూ యువత ఆరోగ్యంగాను, శక్తివంతంగాను, క్రమశిక్షణతో జీవించాలని తెలిపారు. యువత బాధ్యతగా వ్యవహరిస్తు డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని, బానిసైన యువతను సొసైటీ సెంటర్‌కు పంపాలని కోరారు. చెడు వ్యవసానాలకు దూరంగా ఉండాలని పలు సూచనలు చేశారు. సొసైటీ సైకాలజిస్ట్ టి.గంగాధర్ మాట్లాడుతూ కౌమార దశలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఎన్‌హెచ్ కోసం 150 అడుగుల భూసేకరణ

ఆకివీడు: జాతీయ రహదారి నెం.165కు బైపాస్ రోడ్డుగా ఉప్పుటేరు నుంచి అయిభీమవరం, అజ్జమూరు మీదుగా ఎన్‌హెచ్ పాత రోడ్డుకు వచ్చే మార్గంలోని భూముల సేకరణపై అభ్యంతరాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 అడుగుల వెడల్పున భూమి సేకరణ కొనసాగుతోందన్నారు. జాతీయ రహదారుల శాఖ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డు ప్రకారం భూ సేకరణ చేస్తామన్నారు. దీనిలో అభ్యంతరాలుంటే సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. భూమి యజమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ఆయా ప్రాంతాల్లో జరిగిన భూమి విలువలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ నిబంధనల మేరకు సొమ్ము చెల్లిస్తారని చెప్పారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములను పరిశీలిస్తామన్నారు. వ్యవసాయేతర భూములు కన్వర్షన్ ఫీజు చెల్లించి ఉండాలని జేసీ తెలిపారు. భూ సేకరణకు సంబంధించి అజ్జమూరు ప్రాంతంలో 43 ఫిర్యాదులు అందినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ డీఈ శ్రీనివాస్, జిల్లా కలెక్టరేట్ సూపరింటిండెంట్ సీహెచ్. రవికుమార్, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, సబ్‌రిజిస్ట్రార్ బీఎస్‌వీ.లక్ష్మి, డీటీ జి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


ఆకివీడు: భూయజమానులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

గోడౌన్స్ పరిశీలన

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని సివిల్ సప్లయిస్ గోడౌన్స్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎల్ఎస్ పాయింట్, బఫర్ గోదాములను ఆయన పరిశీలించారు. ప్రజలకు అందించే బియ్యం నాణ్యతను పరిశీలించి సేకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాలకు స్టేజ్–2 ద్వారా చేసే రవాణా గురించి అధికారులతో సమీక్షించారు. గోదాముల మరమ్మతులపై పరిశీలన చేసిన జేసీ గోదాములకు వెంటనే రిపేర్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం ఎండీ ఇబ్రహీం, అధికారులు అప్ప, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా అవగాహన కల్పించడం గొప్ప విశేషమని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి కమలాకర్ అన్నారు. ప్రభుత్వ ప్లాస్టిక్ నిషేధ కమిటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్‌ను పారదోలి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు నిచ్చారు. అనంతరం కళాశాల నుంచి గంగులమ్మ అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు.


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎస్ఐఆర్ సర్వే ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ఎన్నికల సంఘం బీహార్‌లో చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సర్వే దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ అన్నారు. పాలకొల్లు కోకోనట్ మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం జరిగిన సీపీఎం జిల్లా స్థాయి శాఖ కార్యదర్శుల రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ సర్వేపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరి తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ 11 ఏళ్లలో తమ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తోందని మండిపడ్డారు. అయితే రాజకీయంగా, లేకపోతే రాజ్యాంగ సంస్థలను ఉపయోగించుకుని రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపూర్ణ మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేయాలనే బీజేపీ కుట్రను ప్రజలు ఓట్ల ద్వారా తిరస్కరించారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఉపయోగించుకునే ఓటు హక్కును కూడా కాలరాసేలా ప్రయత్నిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 8న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరసనల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, చింతకాయల బాబురావు, జిల్లా కమిటీ సభ్యులు డి.కళ్యాణి, పి.పూర్ణ, కేతా పద్మజ, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, పాలకొల్లు ఏరియా కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వి.రాంభూపాల్

క్షీరారామంలో వైభవంగా సహస్రనామార్చన


క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సహస్ర నామార్చన చేస్తున్న అర్చకులు


సహస్ర నామార్చన పూజలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సప్త (ఏడు) సోమవారాలు పూర్తి చేసిన భక్తులు మంగళవారం రూ.100 టికెట్ తీసుకుని సహస్ర నామ పూజలో పాల్గొన్నారు. స్వామి వారి అభిషేక మండపం (దేవునిహాలు)లో నిర్వహించిన సహస్ర నామ పూజలో పాల్గొన్న భక్తులతో ఆలయ ప్రధాన అర్చకులు కిష్టప్ప, అనిల్, అభిషేక పండిట్ సూరిబాబు భక్తులతో స్వామి వారి నామస్మరణ చేయించారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి.వాసు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నేడు పోడూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన

పెనుగొండ: కూటమి నాయకుల కక్షసాధింపులో భాగంగా పండిత విల్లూరు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక చెక్ పవర్ రద్దు చేయించడానికి వ్యతిరేకంగా పోడూరులో బుధవారం నిరసన వ్యక్తం చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు గుబ్బల వీరబ్రహ్మం, సుంకర సీతారామ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. పోడూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటల నుంచి నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. కూటమి నాయకుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ మోసపూరిత ఆరోపణలు చేస్తూ కక్ష సాధింపునకు దిగుతున్నారని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

శక్తీశ్వరస్వామికి విశేష పూజలు


విశేష అలంకరణలో శక్తీశ్వరస్వామి

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో పార్వతి సమేత శక్తీశ్వర స్వామికి ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా ఆలయ అర్చకులు మద్దిరాల సత్యనారాయణమూర్తి, కొడమంచిలి తమ్మిరాజులు స్వామివార్లకు సహస్రనామార్చన, పంచామృత అభిషేకాలు, గోక్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా స్వామివార్లను అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణంరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మావుళ్లమ్మ స్వర్ణ వస్త్ర నిధికి విరాళం


దాతలను సన్మానిస్తున్న ఆలయ అధికారులు


భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో మావుళ్లమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన బీహెచ్ సాయి సహస్ర రూ.లక్ష శాశ్వత నిత్యాన్నదానంకు, అమ్మవారి స్వర్ణ వస్త్ర నిధికి ఎనిమిది గ్రాముల బంగారాన్ని విరాళంగా సమర్పించారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున ప్రత్యేక పూజలు నిర్వహించి చేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ఫోటో ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు ఉత్తమ విద్యను అందజేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): అధ్యాపకులు విద్యార్థులకు ఉత్తమ విద్యను అందజేయాలని డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ డీఆర్ఓ చాంబర్‌లో కాంట్రాక్టు లెక్చర్ల సర్వీసు కొనసాగింపుపై తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు అటానమస్ బాలికల కళాశాల, భీమవరం, గణపవరం, దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ తో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు సర్వీసు ఉన్న కాంట్రాక్టు లెక్చరర్‌లను వారు పని చేస్తున్న కళాశాలలోనే కొనసాగించేలా నిర్ణయించడం జరిగిందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు చదువుకునే ప్రభుత్వ కళాశాలలోని అధ్యాపకులు వారికి మంచి చదువుని అందజేసి ప్రయోజకులను చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

శ్రీకూర్మ తటాకానికి విరాళం


తోలేరులో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని తోలేరులో శ్రీ వల్లి దేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీకూర్మ తటాకానికి రూ.25వేలు నగదును మంగళవారం ఆలయ అధ్యక్షుడు చావాకుల సత్యనారాయణ మూర్తికి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి సత్య రవితేజ– గ్రంధి లక్ష్మిప్రత్యూష దంపతులు ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంధి లక్ష్మి ప్రత్యూష తండ్రి గన్నబత్తుల శ్రీనివాసరావును వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి అభినందించారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

యలమంచిలి: స్థానిక తమ్మినీడి ఉమానరసింహ కల్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ సీపీ యలమంచిలి మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో పార్టీలో వివిధ హోదా కలిగిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మహిళా నాయకులు, సోషల్ మీడియా, యూత్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని జిల్లా రవాణా అధికారి టి ఉమామహేశ్వరరావు సూచించారు. డీఎన్నార్ కళాశాల ప్లాటినం జూబ్లీ హాల్ నందు మంగళవారం స్టూడెంట్స్, కాలేజీ బస్సు డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. వాహనాలను నెమ్మదిగా నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు కె.ఎస్.ఎన్ ప్రసాద్, ఎన్.ఎల్.ఎస్ లక్ష్మి, ఏఎస్‌పి తేజ, ప్రిన్సిపాల్ జి.మోసెస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆటో కిరాయి బాకీల వివాదంలో వ్యక్తిని గాయపరిచిన సంఘటన భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టూటౌన్ పరిధిలోని దుర్గాపురానికి చెందిన లావణ్య అనే హిజ్రా గొల్లవానితిప్ప వెళ్లడానికి పాతబస్టాండ్‌లో ఆటో డ్రైవర్ తిరుమల ఆదినారాయణతో ఆటో కిరాయి మాట్లాడుకుంది. అతను పాత కిరాయి బాకీ కూడా చెల్లించాలని చెప్పగా లావణ్య, ఆదినారాయణ మధ్య ఘర్షణ నెలకొంది. వీరిఇరువురి మధ్య సమస్యను పరిష్కరించడానికి వెళ్లిన బాధితుడు బాలెం ఇబ్రాయ్‌ను లావణ్య చెక్క కర్రతో నుదటిపై కొట్టింది. రక్తస్రావంతో చికిత్స కోసం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రెహమాన్ తెలిపారు.

1120 ఎకరాల్లో వరినాట్లు పూర్తి

భీమవరం అర్బన్: మండలంలోని సార్వా సాగులో 1,120 ఎకరాలలో వరినాట్లు పూర్తయ్యాయని మిగిలిన రైతులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, కొమరాడ, తాడేరు, బేతపూడి, రాయలం, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, తుందుర్రు తదితర గ్రామాల్లో 5,500 ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టారు. వర్షాలు పడటంతో వరినాట్లుకు ఆటంకం, రైతులందరూ ఒకేసారి వరినాట్లు వేయడం తదితర కారణాల వల్ల కూలీలు దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. కొన్ని చోట్ల బెంగాలీ కూలీలను తీసుకువచ్చి వరినాట్లు వేస్తున్నారు. వరినాట్లను త్వరతిగతిన పూర్తి చేయాలని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

భీమవరం (ప్రకాశంచౌక్): కలెక్టరేట్‌లో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పంచాయతీ పొరుగు సేవల ఉద్యోగిని ధనాల లక్ష్మి(53) జులై 8న గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం జరిగింది. విధులు ముగించుకొని ఇంటికి వెళ్లిన ఆమెకు కొంత అస్వస్థతగా ఉండటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై స్పందించిన డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు కలెక్టరేట్ కార్యాలయాల అధికారుల నుంచి కొంత మొత్తాన్ని సేకరించి వారి కోడలు ధనాల పెద్దింట్లకు ఆర్థిక సాయాన్ని అందజేశారు.